## సమస్యలు పరిష్కరించిన బీఆర్ఎస్‌కే ఓటు వేయండి



జూబ్లీహిల్స్‌లోని నవ నిర్మాణ్‌నగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, నవంబర్ 11: సమస్యలు పరిష్కరించిన బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. నియోజకవర్గంలోని బంజారాహిల్స్ రోడ్ నం.3లోని జర్నలిస్ట్ కాలనీ, నాగార్జున హిల్స్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్, కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి ప్రచారం చేశారు. కాలనీవాసులతో సమావేశమైన దానం నాగేందర్ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను గురించి వివరించారు. నగరంలో ఉన్న విద్యుత్ సమస్యలు, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈ ఎన్నికల్లో నియోజకవర్గంలో బీఆర్ఎస్ మరోసారి ఘన విజయం సాధించడం ఖాయమని దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు.

## కార్మికుల పక్షపాతి సీఎం కేసీఆర్

**మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి**




వినాయక్‌నగర్ డివిజన్‌లో జరిగిన కార్మికుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

మల్కాజిగిరి, నవంబర్ 11: కార్మికుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం వినాయక్‌నగర్ డివిజన్‌లో కార్మిక సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మర్రి రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ... కార్మికుల కష్టాలు తనకు తెలుసునని, బీఆర్ఎస్ పార్టీ కార్మికుల హక్కులను కాపాడుతున్నదన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో పరిశ్రమలు మూత పడ్డాయన్నారు. అందులో పనిచేస్తున్న కార్మికులు తినడానికి తిండిలేక పస్తులున్నారని తెలిపారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నిరంతర విద్యుత్‌తో పరిశ్రమలతో పాటు కార్మికులకు ఇబ్బందులు తప్పాయన్నారు. ఆటో, డీసీఎం కార్మికులకు ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ప్రభుత్వం బీమా ద్వారా సహాయం చేస్తున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నామని చెప్పారు. ప్రజల కష్టాలను పట్టించుకోని వారిని ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, పరశురాంరెడ్డి, సర్కిల్ అధ్యక్షుడు ఆర్ జితేందర్ రెడ్డి, కార్పొరేటర్ మురుగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీజేపీవి బోగస్ హామీలు

**ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి**



చర్లపల్లి డివిజన్ శుభోదయ నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీదేవి

చర్లపల్లి, నవంబర్ 11 : కాంగ్రెస్, బీజేపీలు అమలు కానీ హామీలను గుప్పించి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్నారని, ఆ పార్టీల హామీలు బోగస్ అని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని సోనియాగాంధీనగర్ ఫేజ్ – 1,2,3, శుభోదయనగర్, తదితర కాలనీల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవితో కలిసి బండారి లక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తొమ్మిదేండ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మ్యానిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి నాయకులు, కార్యకర్తలు ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్ రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, కనకరాజు గౌడ్, శివకుమార్ గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సురేశ్‌రెడ్డి, ప్రభుగౌడ్, కనకయ్య, గిరిబాబు, అనిల్, బాబు, వెంకటేశ్, రఫీక్, సురేశ్, రాజుగౌడ్, రమేశ్, నర్సింహ, ముత్యాలు, వెంకట్‌రెడ్డి, పరశురామ్‌తో పాటు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రచారంలో దూకుడు పెంచిన బీఆర్ఎస్

- బుజ్జగింపుల పర్వంలోనే కాంగ్రెస్, బీజేపీలు
- 13న నామినేషన్ల పరిశీలన.. 15న ఉపసంహరణ



కాచిగూడలో హోటల్ యాజమానిని ఓటు అభ్యర్థిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేశ్

మేడ్చల్, నవంబర్ 11(నమస్తే తెలంగాణ) : నామినేషన్లు ముగియడంతో ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థులు మరింత వేగం పెంచారు. గులాబీ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనతో ఉత్సాహంగా ప్రచారం చేస్తూ ప్రజల మద్దతును కూడగడుతున్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత తొమ్మిదిన్నరేండ్లలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూస్తున్న వివిధ కుల సంఘాలు, కాలనీ సంక్షేమ సంఘాలు బహిరంగంగా మద్దతు ప్రకటిస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు వేర్వేరుగా ప్రచారం చేస్తూ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతో పాటు రోడ్‌షోలు, ఆత్మీయ సమ్మేళనాలు, బహిరంగ సభలు నిర్వహిస్తూ బీఆర్ఎస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు.

### బుజ్జగింపుల పర్వంలోనే ఆ పార్టీలు

కాంగ్రెస్, బీజేపీలు బుజ్జగింపుల పర్వంలోనే కొట్టుమిట్టాడుతున్నాయి. నామినేషన్ల ప్రక్రియ ముగిసినా ఆ పార్టీల అభ్యర్థులతో ద్వితీయ శ్రేణి నాయకులకు పొసగడం లేదు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇలాంటి పరిస్థితి ఉన్నప్పటికి ఇరు పార్టీల అధిష్ఠానం పట్టించుకోకపోవడంతో కాంగ్రెస్, బీజేపీల కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతుంటే.. పరిస్థితి ఇలానే ఉంటే ఎలా అన్న సందిగ్ధంలో ఇరు పార్టీల శ్రేణులు ఉన్నారు. కొన్ని నియోజకవర్గాలలో టికెట్‌ను ఆశించి భంగపడిన వారు రెబల్ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. ప్రచారం అంతంత మాత్రంగా కొనసాగుతున్న క్రమంలో ఆ పార్టీల పరిస్థితిపై పార్టీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 356 నామినేషన్లు దాఖలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకర్గాలకు సంబంధించి 356 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన ఉండగా.. 15న అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల బరిలో ఎంత మంది అభ్యర్థులు ఉంటారో తేలిపోనుంది.

# సంక్షేమాన్ని చూసి ఆదరించండి

**మలక్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి**



గడ్డిఅన్నారంలో వృద్ధ దంపతులను ఓటు అభ్యర్థిస్తున్న మలక్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి

మలక్‌పేట, నవంబర్ 11 : సంక్షేమాన్ని చూసి ఆదరించి గెలిపిస్తే ఐదేండ్లు సేవకుడిలా పనిచేస్తానని మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన గడ్డిఅన్నారం పోచమ్మ బస్తీలో మాజీ కార్పొరేటర్లు సామ ప్రభాకర్‌రెడ్డి, తీగల సునరితా రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వారి సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో కులవృత్తులను ప్రోత్సహించి పునరుజ్జీవం పోశారని తెలిపారు. గడిచిన తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిధులతో నియోజకవర్గంలో అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయని తెలిపారు. రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి, హైదరాబాద్ నగరానికి విశ్వనగరంగా గుర్తింపు తెచ్చారన్నారు. లక్షలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు యాదగిరి, సల్మాన్ మహ్మద్‌ఖాన్, బీఆర్ఎస్ నాయకులు దాసురావు, దేవదాసు, నాగరాజు, సతీశ్‌రెడ్డి, సునీత్‌పత్తి, ప్రవీణ్, శశిధర్‌రావు, నవనీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజు, పవన్, బైకన్ కుమార్, మహేశ్, టిన్నుసింగ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పార్కులకు నిలయం ఎల్బీ నగర్

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- ఇందిరా ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌ను కలిసి ప్రచారం




సరూర్‌నగర్‌లో ఇందిరా ప్రియదర్శిని పార్కులో వాకర్స్‌ను కలిసి ప్రచారం చేస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 11 : ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని పార్కులకు నిలయంగా మార్చామని, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా సరూర్‌నగర్ ఇందిరా ప్రియదర్శిని పార్కును సందర్శించి వాకర్స్‌ను కలిసి మాట్లాడారు. అనంతరం ఓపెన్ జిమ్‌లో యువకులతో కలిసి వ్యాయామం చేయడంతో పాటు కొద్ది సేపు షటిల్ ఆడారు. అనంతరం వాకర్స్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎల్బీనగర్‌లో చేసిన అభివృద్ధిని చూసి తనకు ఓటు వేయాలని వాకర్స్‌ను కోరారు.ఇందిరా ప్రియదర్శిని పార్కును 2007లోనే సుందరంగా తీర్చిదిద్దామని, తాజాగా ఈ పార్కులో మరిన్ని హంగులను సమకూర్చామన్నారు. ప్రజల కోసం కామినేని ఫ్లై ఓవర్ కింద ఆక్సిజన్ పార్కు, మిగతా పార్కుల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. సరూర్‌నగర్ చెరువును కూడా సుందరీకరించి అందులో బోటు షికారును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీల మాయ మాటలు నమ్మొద్దని, నిత్యం ప్రజల్లో ఉండే నాయకులను ఆదరించాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాస్‌రావు, మహేందర్ యాదవ్, రవి, భాస్కర్ గంగపుత్ర, తిలక్, సత్యం, జైశంకర్, అశోక్, సీనియర్ నాయకులు వెంకటేశ్ గౌడ్, రాజారెడ్డి, మాజీ కార్పొరేటర్ సంగీత ప్రశాంత్‌గౌడ్, మైసయ్య, సీతారాములు పాల్గొన్నారు.